# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రజల సహకారంతో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.**
2. **రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈరోజుఅంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.**
3. **విశాఖపట్నంలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం రెండు గిన్నిస్ రికార్డులను సాధించింది.**
4. **విశాఖపట్నంలో ఐదు లక్షల ఐటీ ఉద్యోగాలు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.**
5. **ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకొంటున్నాం.**

==========================

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం కావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై మంత్రులు, అధికారులతో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజల సహకారం, అధికార యంత్రాంగం సమన్వయంతో యోగా కార్యక్రమాలను నిర్వహించామన్నారు, ఆరోగ్యాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో యోగాంధ్ర ఒక గొప్ప ముందడుగని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

వాయిస్ .. 32 సెకన్లు

---------------------------

అమరావతిలోని రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఈ ఉదయం ఘనంగా జరిగాయి. శాసన సభ, శాసన మండలి ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని పలు రకాల యోగాసనాలను వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షకుపైగా ప్రాంతాల్లో 2 కోట్ల మంది ప్రజలు పాల్గొనేలా నిర్వహించిన ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో శాసన సభ, శాసన మండలి ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని శాసన సభ సెక్రటరీ జనరల్ ఎస్. ప్రసన్న కుమార్ తెలిపారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈరోజుఅంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం, విజయనగరం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, పల్నాడు, అనంతపురం, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరు, శ్రీ సత్య సాయి జిల్లాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్లు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన యోగా కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొని మాట్లాడుతూ..

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------------

విశాఖపట్నంలో ఐదు లక్షల ఐటీ ఉద్యోగాలు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖపట్నంలో మంత్రి ఈరోజు మాట్లాడుతూ, పరిపాలన సౌలభ్యం కోసం రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధిని వికేంద్రీకరిస్తామని చెప్పారు. దక్షిణ భారతదేశంలో గొప్ప ఐటీ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రజల్లో వచ్చిన చైతన్యం వల్లే యోగాంధ్ర విజయవంతం అయ్యిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారని మంత్రి వివరించారు.

-------------------------------

విశాఖపట్నంలో నిర్వహించిన 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం రెండు గిన్నిస్ రికార్డులను సాధించింది. విశాఖ సాగర తీరాన ఈ ఉదయం 3 లక్షల మందికి పైగా యోగాసనాలు వేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నెలకొల్పారు. గిన్నిస్ రికార్డు పత్రాలను రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను ప్రజల జీవనంలో భాగం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలిచ్చిందని అన్నారు. యోగా కార్యక్రమంలో భాగంగా రెండు పురస్కారాలు సొంతం చేసుకోవడం గొప్ప విజయమని తెలుపుతూ..

వాయిస్...30 సెకన్లు

-------------------------------

ఆరోగ్యవంతమైన జీవనశైలి పట్ల అవగాహన పెంపొందించేందుకు యోగా దోహదపడుతుందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 5వేల మందితో యోగా కార్యక్రమం ఈ ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 9 లక్షల మంది పాల్గొన్నారని చెప్పారు. యోగాసనాల ద్వారా శారీరక దృఢత్వం లభిస్తుందని అన్నారు.

-------------------------------

మానసిక బలాన్ని పెంచేందుకు యోగా దోహదపడుతుందని కంట్రోలర్ ఆఫ్ కమ్యునికేషన్ అకౌంట్స్ – ఆంధ్రప్రదేశ్ సర్కిల్ అధికారి టి.సురేష్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా ఈరోజు విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ కమ్యునికేషన్ అకౌంట్స్ కార్యలయం అధికారులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. పని ఒత్తిడిని అధిగమించేందుకు

ప్రతిరోజు యోగా సాధన చేయాలని సూచించారు.

---------------------------

సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, మైగవర్నమెంట్ సంస్థతో కలిసి, దేశవ్యాప్తంగా సృజనాత్మక పోటీలను నిర్వహిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ 11 ఏళ్ల దార్శనిక నాయకత్వం, అభివృద్ధి, పరివర్తనాత్మక పాలన అంశాలను తెలిపేలా 'బదల్తా భారత్ మేరా అనుభవ్, పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్ మేకింగ్, యూట్యూబ్ షార్ట్స్ మేకింగ్, షార్ట్ ఆడియో విజువల్స్, బ్లాగ్ భారత్, వికసిత్ భారత్ క్విజ్ వంటి పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీలు జూలై 9వ తేదీతో ముగియనున్నాయి. ఈ పోటీలలో విజేతలకు 5000 నుంచి 3 లక్షల రూపాయల వరకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

---------------------------

ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకొంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఏకంచేసి అనేక మానసిక రుగ్మతలను దూరంచేసే శక్తి సంగీతానికి వుంది. అటువంటి సంగీతానికి మానవాళి జీవితంలో వున్న ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. 120 దేశాలలోని ప్రజలు ఈ సంగీత దినోత్సవంలో పాల్గొంటున్నారు. ఫ్రాన్స్ సాంస్కృతిక శాఖ మంత్రి జాన్ లాంగ్ 1982 జూన్ 21వ తేదీన పారిస్‌లో మొదటి సంగీత మహోత్సవాన్ని నిర్వహించారు. అప్పటినుంచి ప్రతి ఏటా జూన్ 21ని ప్రపంచ సంగీత దినోత్సవంగా పాటిస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు కొద్ది సేపటి క్రితం ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...32 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================